క్లుప్తంగా

రేపు కార్తిక మాస ఉత్సవాలకు పందిరిరాట

సామర్లకోట: కార్తిక మాస ఉత్సవాలకు సంబంధించి ఈ నెల 24న పందిరిరాట వేస్తున్నట్టు ఈఓ డి నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవంబర్ 13 నుంచి నెల రోజుల పాటు నిర్వహించే కార్తిక మాస ఉత్సవాల ఏర్పాట్లకు టెండర్లు స్వీకరించామని చెప్పారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 9.24కు పందిరిరాట ముహూర్తం నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమానికి ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం నాయకులు, భక్తులు హాజరు కావాలని కోరారు. పందిరిరాట నుంచి ఆలయంలో క్యూలైన్లు, ఇతర పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఆలయ కోనేరులో నీటిని కార్తిక మాసంలో మార్పు చేస్తామని తెలిపారు.

ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి : సీఐ

కొత్తపల్లి: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో కమిటీ సభ్యులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ అన్నారు. నిమజ్జనం జరిగే తీర ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. కోనపాపపేట నుంచి ఉప్పాడ శివారు వరకూ తీరప్రాంతంలో రెండు చోట్ల నిమజ్జనానికి అనుమతిస్తున్నట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనానికి సబంధించి ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో ఎటువంటి అశ్లీల నృత్యాలు కార్యక్రమాలు నిర్వహించొద్దన్నారు. ఏం జరిగినా కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాలని సూచించారు.

అవినీతి నిర్మూలనపై వ్యాసరచన పోటీ


వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దాపురం: ఆరోగ్యకర సమాజానికి అవినీతి నిర్మూలనే మార్గమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా సూరంపాలెం పవర్‌గ్రిడ్ అవినీతి నిరోధక శాఖ సంయుక్తాధ్వర్యంలో పోటీలు జరిగాయి. డీజీఎం సత్యవర్ధన్, నవోదయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థి దశ నుంచే పాటుపడాలని చెప్పారు. అవినీతిని అరికడదాం .. దేశాన్ని రక్షిద్దాం.. అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, కిషోర్, పవర్ గ్రిడ్ అధికారులు ఏహెచ్‌వీ కుమార్, ఏఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం : ఎస్పీ


ఎస్పీ సతీష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కోచ్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక వివేకానంద పార్కులోని తైక్వాండో శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. ఇటీవల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు పొందిన క్రీడాకారులను అభినందించారు. వారికి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి బి.అర్జునరావు, జిల్లా పీఈటీ సంఘ కార్యదర్శి నూకరాజు, కోచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.


రాపర్తిలో దుర్గామల్లేశ్వరిదేవికి రూ.10 లక్షల కరెన్సీతో అలంకరణ


కొమరగిరిలో మహాకాళీదేవి అవతారంలో బాలకనకదుర్గా


విశేష అలంకారంలో పురుహూతికా అమ్మవారు


పాదగయ క్షేత్రంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన శ్రీరాజరాజేశ్వరీదేవి


కాండ్రకోటలో దుర్గాదేవి అవతారంలో నూకాలమ్మ అమ్మవారు


మహాగౌరి అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి

అమ్మా భవానీ..!

- దుర్గాదేవిగా రాజరాజేశ్వరీదేవి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పిఠాపురం: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీదేవి దుర్గాదేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పురూహూతికాదేవికి కుంకుమ పూజలు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలో కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో బుధవారం దశమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరో పక్క వివిధ వ్యాపార సంస్థలు దశరా ప్రత్యేక పూజలకు తమ తమ కార్యాలయాలను సిద్ధం చేశారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉన్న లలితాదేవి అమ్మవారికి దుర్గాష్టమి, మహర్నవమి సమయంలో 9000 గాజులతో అలంకరణ 108 రకాల వంటలతో మహా భోగ నివేదన, సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించగా పలువురు భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మహాగౌరి అలంకరణలో గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి దర్శనమిచ్చారు. పిఠాపురంలో మహాలక్ష్మి దేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాకాళీ దేవిగా..

కొత్తపల్లి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా 8 రోజు ఆదివారం మండలంలోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో ఉన్న కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. కొమరగిరిలో శ్రీబాలకనకదుర్గాదేవి మహాకాళీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పంచారామ క్షేత్రంలో చండీ హోమం

సామర్లకోట: శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణ, మండలంలోని వివిధ దేవాలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజలకు భక్తులు పోటెత్తారు. భవానీ మాలధారులు అమ్మవారి ఆలయాలకు తరలివచ్చారు. స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో అమ్మవారిని విజయదుర్గగా అలంకరించారు. నోరి కృష్ణారావు మాస్టారు ఆధ్వర్యంలో చండీహోమం జరిగింది. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. స్థానిక రజకపేట ఏలేరు కాలువ వద్ద ఉన్న కావమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, దంపతులతో కుంకుమ పూజలు జరిపారు. మహిళలకు కుంకుమ, గాజులను అందజేశారు. ఆలయ అర్చకుడు నాగేష్ పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు మారిబాబు, నాగేశ్వరరావు, బాబ్జీ, హరి, కాటయ్య, భరత్‌కుమార్ భక్తులకు సేవలందించారు.

సామూహిక అష్టలక్ష్మి పూజలు

పీబీ దేవంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పాలను భక్తి శ్రద్ధలతో చేశారు. సమితి నాయకులు తోటకూర గంగాధర్, వింజమూరి విశ్వనాథ్, టీవీవీ సత్యనారాయణ, నువ్వుల వెంట్రాజు, బాబ్జీ సేవలందించారు. వేట్లపాలెంలోని బేతాళస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

దుర్గాంబగా భువనేశ్వరి అమ్మవారు

పెద్దాపురం: దసరా సందర్భంగా స్థానిక వర్జులవారి వీధిలో ఉన్న శ్రీభువనేశ్వరి పీఠంలో ఆదివారం భువనేశ్వరి అమ్మవారు దుర్గమ్మ అవతారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి, శాస్త్రీల ఆధ్వర్యంలో పీఠంలో మండపారాధన, అమ్మవారికి అయ్యవారికి అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం, మంత్ర పుష్పం, దర్బారు సేవ నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ పదో రోజు దశమి సందర్భంగా విశేషార్చన, అలంకరణతో పాటు పూర్ణాహుతి, సాయంత్రం జమ్మిచెట్టుకు పూజ ఉంటాయని తెలిపారు.

దుర్గాదేవి అవతారంలో..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దాపురం మరిడమ్మ, మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఈఓలు సీహెచ్ రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద చండీ హోమం

సామర్లకోట: పెన్షన్‌లైన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం చండీ హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొత్తగొల్ల గోవిందు, కందెర్ల భాగ్యరాజ్, గన్నిలక్ష్మి ఆధ్వర్యంలో హోమం జరిగింది.


దుర్గాడలో లలితాదేవి అమ్మవారికి 108 రకాల వంటలతో మహా భోగనివేదన


భువనేశ్వరి పీఠంలో చేస్తున్న చండీ హోమం


సామర్లకోట పంచారామ క్షేత్రంలో చేస్తున్న చండీ హోమం


సామర్లకోట కావమ్మ ఆలయంలో కుంకుమార్చన


సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద చండీహోమం

పల్లెల అభివృద్ధికి పెద్దపీట

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఇందుగపల్లిలో గ్రామ సచివాలయం ప్రారంభం


ఇందుగపల్లిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: పల్లెల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఇందుగపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం సర్పంచులు కుంచే సత్యవతి, సుర్ల రాంబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ సీఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారన్నారు. వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. పల్లెల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావించి ముందుకెళ్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక బాలాత్రిపురసుందరి ఆలయంలో బాలాత్రిపుర సుందరి కూచిపూడి డాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 83 మంది కళాకారులు గణేశస్తుతి, అదిగోఅల్లదిగో, ముద్దుగారే యశోద, శివస్తుతి, దుర్గాస్తుతికి శ్రీను, తిరుమల, రిజ్వానా, గాయత్రీ, రేణుక, శాంతి, షణ్ముఖ, జాహ్నవి, విజ్ఞసాయి, జాను, రూపానాయుడు, దేవిశ్రీ, ఝాన్సీలక్ష్మి, సామ చేసిన నృత్యాలు అలరించాయి. ఐదేళ్ల చిన్నారి మోక్ష చేసిన నాగిని నృత్యం ఆకట్టుకుంది. అకాడమీ చైర్మన్ బేతా సత్యనారాయణ వీరిని మయూరి పురస్కారాలతో సత్కరించారు.

సాగర తీరం.. సందడిమయం..


పర్యాటకులతో నిండిన ఉప్పాడ సాగర తీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. చిన్నా పెద్దా అని తేడా లేకుండా ఆటపాటలతో సేదతీరారు. మండలం నుంచే కాకుండా పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారి దర్శించుకుని వెళ్లిన భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకుని సందడి చేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణాలకు, భావనారాయణపురంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. డ్రైనేజీ నిర్మాణాలను పరిశీలించి, అవుట్‌లెట్ల ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ సర్పవరం గ్రామంలో రూ.80 లక్షలతో డ్రైనేజీలు నిర్మిస్తున్నామని వివరించారు. గడపగడపకూ కార్యక్రమంలో ప్రజల నుంచి డ్రైనేజీలు, రోడ్ల కోసం వినతులు రావడంతో, వీటి నిర్మాణాలకు వేగవంతం చేశామన్నారు. త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. భావనారాయణపురంలో శెట్టిబలిజల కోసం బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గ్రామ నాయకులు పుల్ల చందు, పుల్ల కోటేశ్వరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, వార్డు సభ్యుడు చక్రరావు, మండల ఇంజనీర్ వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వన్నెం మురళి తదితరులు పాల్గొన్నారు.


సర్పవరంలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అన్ని విధాలా సర్పవరం ఆలయాభివృద్ధి


వంటశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: నారద మహాముని స్వయంగా ప్రతిష్ఠించిన సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఆలయం వెనుక నూతనంగా నిర్మించిన వంటశాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని, అన్నదానానికి హాజరైన భక్తులకు వడ్డన చేశారు. అనంతరం అయ్యప్ప, భవానీ భక్తులకు దీక్షా సమయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రముఖ దేవాలయంగా సర్పవరం ఆలయం ప్రసిద్ధి చెందిందన్నారు. ఆలయం వద్ద గోశాలను అభివృద్ధి చేశామని, ప్రతి ఆదివారం భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నామని చెప్పారు. అయ్యప్ప భక్తుల 41 రోజుల దీక్షకు గ్రామస్తులు నిత్యాన్నదానాన్ని ఆలయం వద్దే ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరావు, ఈఓ భీమేశ్వరరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సర్పంచ్ పీలా నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పుల్లాచందు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రభాకరరావు, రాష్ట్ర సివిల్‌సప్లైస్ డైరెక్టర్ జమ్మలమడుగు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు నూరు శాతం

- మండలంలో 24 వేల ఎకరాల పంట భూములు
- ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం
- జీపీఎస్ పరికరాలతో వాహనాల సమస్యకు చెక్


చంద్రంపాలెంలో మహిళా రైతుకు ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: ఈ-క్రాప్ బుకింగ్ మండలంలో నూరు శాతం పూర్తి కాగా, ఈ-కేవైసీ 98 శాతం పూర్తయింది. మండలంలో 24 వేల ఎకరాల పంట భూములకు 11,644 మంది రైతులు హక్కుదారులుగా ఉన్నారు. వీరు 22,212 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. 666 ఎకరాల్లో పామోలిన్, మిగిలిన భూముల్లో కొబ్బరి, అరటి, సపోట, జొన్న వంటి పంటలను పండిస్తున్నారు. రైతులు ఈ-క్రాప్ బుకింగ్‌తో రైతులు ఏ పంటలు వేస్తున్నారో తెలుసుకునే అవకాశం ఉంటుంది. పంట నమోదైన తర్వాత రైతులు ఈ-కేవైసీ (వేలిముద్ర) వేయాల్సి ఉంటుంది. అప్పుడే విత్తనాల మొదలు ధాన్యం కొనుగోలు వరకూ ప్రభుత్వ సహకారం రైతులకు లభిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో రైతులను ఆదుకునేందుకు ఈ ప్రక్రియ కీలకంగా మారుతోంది.

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో..

రైతులు తమ పంటలను నమోదు చేసుకోవడం వల్ల పంట బీమా పరిహారం అందుతుంది. సున్నా వడ్డీకి పంట రుణాలందుతాయి. రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, పురుగు మందులు రైతులకు లభిస్తాయి. గిట్టుబాటు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తారు. రైతులకు కావాల్సిన వ్యవసాయ యంత్ర సామగ్రి సబ్సిడీకి లభిస్తాయి. రైతు భరోసా కేంద్రంలో ప్రతీ రైతు భూమి వివరాలు, గ్రామం, సర్వే నంబరు, ఆధార్ వివరాలను నమోదు చేయించాలి. గ్రామానికి చెందిన వీఏఏలు వచ్చినప్పుడు తప్పనిసరిగా రైతులు పంట భూమి వద్ద ఫొటో తీయించుకోవాలి. కౌలు రైతులకు కూడా ఈ-క్రాప్ నమోదు చేస్తారు.

వాహనాల సమస్యకు చెక్

పొలం నుంచి ధాన్యం మిల్లుకు చేర్చే సమయాల్లో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ పరికరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ సమయాలను కూడా గుర్తించే అవకాశం ఉంటుంది. గతంలో మిల్లుల్లో ఎక్కువ సమయం ధాన్యం వాహనాలు నిలిచి పోతున్నాయనే విమర్శల నేపథ్యంలో జీపీఎస్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి 225 వాహనాలు అవసరమని అధికారులు గుర్తించారు.


వేట్లపాలెంలో జీపీఎస్ అమర్చిన వాహనాలు

జీపీఎస్‌తో రైతులకు ప్రయోజనం



ధాన్యం రవాణా చేసే ప్రతీ వాహనానికి జీపీఎస్ అమర్చడం వల్ల మిల్లుకు ముందుగా చేరిన వాహనాలే తొలుత అన్ లోడింగ్ చేసే అవకాశం ఉంటుంది. మిల్లర్లు పక్షపాతం చూపడానికి అవకాశం ఉండదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలతో దళారుల సమస్య తీరింది. సమస్యలు తీరడంతో రైతులు వ్యవసాయంపై దృష్టి పెడుతున్నారు.

– వెలమర్తి బుల్లిరాజు, రైతు, వీకే రాయపురం

అన్ని వాహనాలకూ జీపీఎస్



మండలంలో 225 వాహనాల ద్వారా ధాన్యం రవాణా చేసే అవకాశం ఉంది. నవంబర్ తొలి వారంలో పీబీ దేవం, వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఆయా గ్రామాల్లోని రైతుల కోసం 60 వాహనాలకు జీపీఎస్ అమర్చారు.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

అలరించిన సంగీత విభావరి

కాకినాడ రూరల్: దసరా వేడుకల్లో భాగంగా కాకినాడ బీచ్ సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన సంగీత విభావరి అలరించింది. కళాకారులు బ్రహ్మానందం, పైల సత్యనారాయణ, వరలక్ష్మి తమ గానమాధుర్యంతో ఆకట్టుకున్నారు. వీరిని శిల్పారామం ఏఓ ప్రకాష్ సత్కరించారు.